నేటి మ్యాచ్‌లు | గుజరాత్ X బెంగళూరు అహ్మదాబాద్: మ. 3.30 | చెన్నై X హైదరాబాద్ చెన్నై: రా. 7.30

ఐపీఎల్‌లో రికార్డు స్కోర్లు

549-ఎస్‌ఆర్‌హెచ్X ఆర్సీబీ
523-ఎస్‌ఆర్‌హెచ్X ముంబై
523-కేకేఆర్ X పంజాబ్
504-ఢిల్లీX ముంబై

ఉత్కంఠ పోరులో ముంబై ఓటమి

ఢిల్లీ జీత్‌గయా..

జేక్ ఫ్రేజర్, స్టబ్స్ వీరవిహారం • తిలక్‌వర్మ ఒంటరి పోరు వృథా

ఢిల్లీ క్యాపిటల్స్ దుమ్మురేపింది! సొంత ఇలాఖాలో మరో భారీ స్కోరింగ్ మ్యాచ్‌లో మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్‌ను మట్టికరిపించింది. యువ సంచలనం జేక్ ఫ్రేజర్ ధనాధన్ ఇన్నింగ్స్‌కు తోడు ఆఖర్లో స్టబ్స్ సుడిగాలి ఆటతో ఢిల్లీ 257 స్కోరు అందుకుంది. ముంబై బౌలర్లను చెడుగుడు ఆడుకుంటూ ఫ్రేజర్ బౌండరీలతో విరుచుకుపడ్డాడు. 11 ఫోర్లు, ఆరు భారీ సిక్సర్లతో వీరవిహారం చేసిన ఈ హార్డ్‌హిట్టర్ ధాటికి ముంబై విలవిలలాడిపోయింది. భారీ లక్ష్యఛేదనలో సహచరులు విఫలమైనా..తిలక్‌వర్మ ఒంటరిపోరాటంతో జట్టును గెలిపించేందుకు చేసిన ప్రయత్నం నెరవేరలేదు. వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయిన ముంబై విజయానికి 10 పరుగుల దూరంలో బోల్తా కొట్టింది.

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో మరో భారీ స్కోరు అభిమానులను అలరించింది. శనివారం జరిగిన తొలి పోరులో ఢిల్లీ 10 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. తొలుత జేక్ ఫ్రేజర్(27 బంతుల్లో 84, 11ఫోర్లు, 6సిక్స్‌లు) అర్ధసెంచరీకి తోడు స్టబ్స్(25 బంతుల్లో 48 నాటౌట్, 6ఫోర్లు, 2 సిక్స్‌లు), హోప్(41) రాణించడంతో ఢిల్లీ నిర్ణీత ఓవర్లలో 257/4 భారీ స్కోరు చేసింది. నబీ, చావ్లా, బుమ్రా, వుడ్ ఒక్కో వికెట్ తీశారు. ఆ తర్వాత లక్ష్య ఛేదనకు దిగిన ముంబై 247/9 స్కోరు చేసింది. తిలక్‌వర్మ(32 బంతుల్లో 63, 4ఫోర్లు, 4 సిక్స్‌లు), హార్దిక్‌పాండ్యా(46) ఆకట్టుకున్నారు. ముఖ్యంగా తిలక్‌వర్మ సూపర్ ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు.ముకేశ్‌కుమార్ (3/59), రసిక్ సలామ్ (3/34) మూడేసి వికెట్లు తీశారు. ఫ్రేజర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

ఫ్రేజర్ ఫటాఫట్: తొలుత టాస్ గెలిచిన ముంబై కెప్టెన్ హార్దిక్ పాండ్యా..ఢిల్లీని బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. ఇక్కడే పాండ్యా పప్పులో కాలేశాడు. అందివచ్చిన అవకాశాన్ని ఢిల్లీ చక్కగా వినియోగించుకుంది. ఓపెనర్ ఫ్రేజర్ తొలి బంతి నుంచే విధ్వంసానికి తెరతీశాడు. ఫలితంగా 19 పరుగులు వచ్చిపడ్డాయి. రెండో ఓవర్‌కు దిగిన బుమ్రాను కూడా ఫ్రేజర్ గట్టిగానే అరుసుకున్నాడు. నోబాల్‌తో బౌలింగ్ మొదలుపెట్టిన బుమ్రా ఓవర్‌లో 18 పరుగులు పిండుకున్నాడు. ఆ తర్వాత తుషారకు మూడు ఫోర్లతో స్వాగతం పలికాడు. బౌలింగ్ మార్పుగా వచ్చిన చావ్లాను విడిచిపెట్టకుండా బాదడంతో 15 బంతుల్లోనే ఫ్రేజర్ అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. లాభం లేదనుకుని బౌలింగ్‌కు వచ్చిన కెప్టెన్ పాండ్యాను ఫ్రేజర్ రెండు ఫోర్లు, రెండు సిక్స్‌లు దంచుకున్నాడు. దీంతో పవర్‌ప్లే ముగిసే సరికి ఢిల్లీ వికెట్ కోల్పోకుండా 92 పరుగులు చేసింది. ప్రమాదకరంగా మారుతున్న ఫ్రేజర్‌ను చావ్లా ఔట్ చేయడంతో తొలి వికెట్‌కు 114 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత వచ్చిన హోప్..పోరెల్‌కు జతకలిశాడు. హోప్ ఉన్నంతసేపు సిక్స్‌లతో స్టేడియాన్ని ఊపేశాడు. నబీ బౌలింగ్‌లో ఇషాన్ కిషన్ క్యాచ్‌తో పోరెల్ ఔటయ్యాడు. రిషబ్ పంత్(29) ఫర్వాలేదనిపించినా..ఆఖర్లో స్టబ్స్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. వుడ్ వేసిన 18వ ఓవర్లలో స్టబ్స్ ఐదు ఫోర్లు, సిక్స్‌తో 26 పరుగులు కొల్లగొట్టాడు.

తిలక్ పోరాడినా:

నిర్దేశిత లక్ష్యఛేదనలో ముంబైకి సరైన శుభారంభం దక్కలేదు. రోహిత్‌శర్మ(8), ఇషాన్‌కిషన్(20) నిరాశపరిచారు. ఖలీల్ బౌలింగ్‌లో షాట్ ఆడబోయిన రోహిత్..హోప్ క్యాచ్‌తో తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. పది పరుగుల తేడాతో కిషన్ కూడా ఔట్ కావడంతో ముంబై కష్టాల్లో పడింది. ఈ దశలో ఆదుకుంటాడనుకున్న సూర్యకుమార్(26) ఉన్నంతసేపు బ్యాటు ఝుళిపించినా..అదే జోరు కొనసాగించలేకపోయాడు. యువ బ్యాటర్ తిలక్‌వర్మ మంచి పరిణితి కనబరిచాడు. సహచరులు ఒక్కొక్కరుగా ఔట్ అవుతున్నా..కెప్టెన్ పాండ్యాతో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. వీరిద్దరు కలిసి ఢిల్లీ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ లక్ష్యాన్ని కరిగించే ప్రయత్నం చేశారు.సలాం బౌలింగ్‌లో ముకేశ్ క్యాచ్‌తో పాండ్యా ఔటయ్యాడు. దీంతో నాలుగో వికెట్‌కు 71 పరుగుల పార్టనర్‌షిప్‌కు బ్రేక్‌పడింది. వదేరా(4) విఫలంకాగా, డేవిడ్(37)తో కలిసి వర్మ..మళ్లీ ఇన్నింగ్స్‌కు ఊపు తీసుకొచ్చాడు. వీరిద్దరి ఆటతో ఒక దశలో ముంబై గెలుస్తుందనిపించింది. కానీ డేవిడ్, నబీ(7) ఔట్ కావడం ముంబై చాన్స్‌ను దెబ్బతీసింది. ఆఖరి ఓవర్లో 25 పరుగులు అవసరమైన దశలో తొలి బంతికే వర్మ రనౌట్ కావడంతో ముంబై ఓటమి ఖరారైంది.

సంక్షిప్త స్కోర్లు

ఢిల్లీ: 20 ఓవర్లలో 257/4 (ఫ్రేజర్ 84, స్టబ్స్ 48*, నబీ 1/20, బుమ్రా 1/35), ముంబై: 20 ఓవర్లలో 247/9 (తిలక్‌వర్మ 63, పాండ్యా 46, రసిక్ 3/34, ముకేశ్ 3/59)

సురేఖ స్వర్ణ ధమాకా

- **మూడు పసిడి పతకాలు కైవసం**
- **ఆర్చరీ ప్రపంచకప్ టోర్నీ**

షాంఘై: ప్రతిష్ఠాత్మక ఆర్చరీ ప్రపంచకప్‌లో తెలుగు యువ ఆర్చర్ వెన్నెం జ్యోతి సురేఖ స్వర్ణ ధమాకాతో అదరగొట్టింది. పారిస్ ఒలింపిక్స్‌కు ముందు అద్భుత ప్రదర్శన కనబరుస్తూ మూడు పసిడి పతకాలతో మెరిసింది. శనివారం జరిగిన వేర్వేరు కాంపౌండ్ విభాగాల్లో భారత ఆర్చర్లు ఐదు పతకాలు కొల్లగొట్టారు. ప్రస్తుతం ఆర్చరీ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మూడో ర్యాంక్‌లో కొనసాగుతున్న సురేఖ మరోమారు సత్తాచాటుతూ పసిడి పతకాలు కొల్లగొట్టింది. శనివారం హోరాహోరీగా సాగిన మహిళల కాంపౌండ్ వ్యక్తిగత పోరులో సురేఖ 146-146(9-9) స్కోరుతో అండ్రియా బెస్సెరా(మెక్సికో)పై అద్భుత విజయం సాధించింది. నువ్వానేనా అన్నట్లు సాగిన పోరులో స్కోర్లు సమం కాగా షూటౌట్‌లో సురేఖ విజేతగా నిలిచింది. అదే జోరు కొనసాగిస్తూ కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్‌లో సురేఖ, అభిషేక్‌వర్మ జోడీ 158-157తో లిసెల్లీ, రాబిన్(ఈస్తోనియా)పై గెలిచి స్వర్ణం సొంతం చేసుకుంది. మహిళల కాంపౌండ్ టీమ్ ఈవెంట్ తుది పోరులో జ్యోతిసురేఖ, అదితి గోపీచంద్, పర్నీత్‌కౌర్ త్రయం 236-235తో మార్సెలా టినోలి, ఇరెన్ ఫ్రాచిని, ఎలీసా రోసర్(ఇటలీ)పై పసడి కైవసం చేసుకుంది. మరోవైపు పురుషుల కాంపౌండ్ టీమ్ ఫైనల్లో అభిషేక్, ప్రియాంశ్, పార్థమేశ్ త్రయం 238-231తో మైక్ స్కాల్సర్, సిల్ పాటర్, స్టెఫ్ విలియమ్స్‌పై స్వర్ణం సొంతం చేసుకుంది.

మెరిసిన ఇషాసింగ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌కు సన్నాహకంగా జరుగుతున్న సెలెక్షన్ ట్రయల్స్‌లో భారత స్టార్ షూటర్ ఇషాసింగ్ ఆకట్టుకుంది. ఢిల్లీ వేదికగా జరుగుతున్న ట్రయల్స్‌లో శనివారం జరిగిన మహిళల 10మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో ఇషా 244.9 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. రిథమ్ సాంగ్వాన్, పాలక్ వరుసగా రెండు, మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు.

'రెజ్లింగ్ సంఘంపై మళ్లీ నిషేధం వేస్తాం'

ప్రపంచ రెజ్లింగ్ సమాఖ్య హెచ్చరిక

న్యూఢిల్లీ: ఆట వ్యవహారాలను తిరిగి అడ్‌హాక్ కమిటీకి అప్పగించాలని చూస్తే భారత రెజ్లింగ్ సమాఖ్య(డబ్ల్యూఎఫ్ఐ)పై నిషేధం విధిస్తామని ప్రపంచ రెజ్లింగ్ సమాఖ్య(యూడబ్ల్యూడబ్ల్యూ) హెచ్చరికలు జారీ చేసింది. డబ్ల్యూఎఫ్ఐ వ్యవహారాల్లో బయటి వ్యక్తుల లేదా సంస్థల ప్రమేయాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని యూడబ్ల్యూడబ్ల్యూ తమ లేఖలో స్పష్టం చేసింది. 'రెజ్లింగ్ వ్యవహారాలను మళ్లీ అడ్‌హాక్ కమిటీకి అప్పగించేందుకు క్రీడా శాఖ ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. ఇదే ఉత్పన్నమైతే సమాఖ్యపై సస్పెన్షన్ వేయడంతో పాటు వచ్చే నెలలో జరిగే ఒలింపిక్ క్వాలిఫయర్స్ టోర్నీలో పోటీపడకుండా భారత రెజ్లర్లపై నిషేధం విధిస్తాం' అని యూడబ్ల్యూడబ్ల్యూ అధ్యక్షుడు నెనాద్ లలవోవిచ్ పేర్కొన్నాడు.

రాయల్స్ టాప్ షో

- **లక్నోపై రాజస్థాన్ ఘన విజయం**
- **దాదాపు ప్లేఆఫ్స్ బెర్తు ఖరారు**
- **రాణించిన శాంసన్, జురెల్**

లక్నో: ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ వరుస విజయాల జోరు కొనసాగుతున్నది. ప్రత్యర్థి ఎవరన్నది లెక్కచేయకుండా గెలుపే లక్ష్యంగా రాయల్స్ టాప్‌గేర్‌లో దూసుకెళుతున్నది. శనివారం జరిగిన మ్యాచ్‌లో రాయల్స్ 7 వికెట్ల తేడాతో లక్నో సూపర్‌జెయింట్స్‌పై ఘన విజయం సాధించింది. లక్నో నిర్దేశించిన 197 పరుగుల లక్ష్యాన్ని రాజస్థాన్ 19 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 199 పరుగులు చేసింది. కెప్టెన్ సంజూ శాంసన్(33 బంతుల్లో 71 నాటౌట్, 7ఫోర్లు, 4 సిక్స్‌లు) సమయోచిత అర్ధసెంచరీకి తోడు ధృవ్ జురెల్(34 బంతుల్లో 52 నాటౌట్, 5ఫోర్లు 2 సిక్స్‌లు) రాణించాడు. ఛేదనలో రాజస్థాన్‌కు మెరుగైన శుభారంభమే దక్కింది. ఓపెనర్లు బట్లర్(34), జైస్వాల్(24) ఫర్వాలేదనిపించారు. యశ్ ఠాకూర్(1/50) బౌలింగ్‌లో బట్లర్ ఔట్ కావడంతో తొలి వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత వచ్చిన శాంసన్ ఇన్నింగ్స్ బాధ్యతను భుజానేసుకున్నాడు. రియాన్ పరాగ్(14) విఫలమైనా..జురెల్‌తో కలిసి శాంసన్ కీలక ఇన్నింగ్స్‌కు తెరతీశాడు. లక్నో బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తూ బౌండరీలతో విరుచుకుపడ్డాడు. భారీ మైదానాన్ని దృష్టిలో పెట్టుకుంటూ షాట్లతో అలరించాడు. వీరిని విడదీసేందుకు లక్నో కెప్టెన్ రాహుల్ బౌలర్లను మార్చిమార్చి ప్రయోగించినా లాభం లేకపోయింది. స్టోయినిస్, అమిత్‌మిశ్రాకు ఒక్కో వికెట్ దక్కింది. అంతకుముందు లక్నో 20 ఓవర్లలో 196/5 స్కోరు చేసింది. రాహుల్(48 బంతుల్లో 76), దీపక్ హుడా(50) అర్ధసెంచరీలతో రాణించారు. డికాక్ (8), స్టొయినిస్(0), పూరన్ (11) తీవ్రంగా నిరాశపరిచారు. సందీప్‌శర్మ (2/31) రెండు వికెట్లు తీయగా, బౌల్ట్, అవేశ్, అశ్విన్ ఒక్కో వికెట్ ఖాతాలో వేసుకున్నారు. అజేయ అర్ధసెంచరీతో జట్టును గెలిపించిన శాంసన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఈ విజయంతో మొత్తంగా 16 పాయింట్లతో ఉన్న రాజస్థాన్ అనధికారికంగా ప్లేఆఫ్స్ బెర్తు ఖరారు చేసుకుంది.

సంక్షిప్త స్కోర్లు

లక్నో: 20 ఓవర్లలో 196/5(రాహుల్ 76, హుడా 50, సందీప్2/31, అశ్విన్ 1/39), రాజస్థాన్:19 ఓవర్లలో 199/3 (శాంసన్ 71 నాటౌట్, జురెల్ 52*, స్టోయినిస్ 1/3, మిశ్రా 1/20)

డబుల్స్ రన్నరప్ శాన్విత జోడీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: కిగాలి(రువాండ) వేదికగా జరిగిన వరల్డ్ టూర్ టెన్నిస్ ఐటీఎఫ్ జూనియర్ సర్క్యూట్‌లో తెలంగాణ యువ ప్లేయర్ నూకల శాన్విత రెడ్డి ఆకట్టుకుంది. శనివారం జరిగిన మహిళల డబుల్స్ ఫైనల్లో శాన్విత, లౌరా చనోవా(చెకోస్లోవియా) జోడీ 3-6, 1-6తో స్టెలా జిమోవిచ్, నేహా కృష్ణన్ ద్వయం చేతిలో ఓడి రన్నరప్ టైటిల్ దక్కించుకుంది.

భారత్ బోణీ

థామస్, ఉబర్ కప్ టోర్నీ

చెంగ్డు(చైనా): ప్రతిష్ఠాత్మక థామస్ కప్, ఉబర్‌కప్ టోర్నీలో భారత్ అదిరిపోయే బోణీ కొట్టింది. శనివారం జరిగిన ఉబర్ కప్ తొలి పోరులో భారత్ 4-1 తేడాతో కెనడాపై అద్భుత విజయం సాధించింది. తొలుత జరిగిన మహిళల సింగిల్స్ పోరులో యువ షట్లర్ అశ్మిత చాలిహా 26-24, 24-22తో మిచెల్లీ లీపై సంచలన విజయం సాధించింది. 42 నిమిషాల్లో ముగిసిన పోరులో తన(53 ర్యాంక్) కంటే మెరుగైన ర్యాంక్‌లో మిచెల్లీ(25)కి అశ్మిత ఊహించని షాక్ ఇచ్చింది. మహిళల డబుల్స్‌లో ప్రియ, శృతి జోడీ 21-12, 21-10తో క్యాథరిన్, జెస్లిన్ ద్వయంపై గెలిచింది. మరో సింగిల్స్‌లో ఇప్రాని బారుహా 21-13, 21-12తో వెన్ యు జాంగ్‌పై గెలువడంతో భారత్ ఆధిక్యం 3-0కు చేరుకుంది. పురుషుల విభాగంలో భారత్ 4-1తో థాయ్‌లాండ్‌పై విజయం సాధించింది. సింగిల్స్‌లో ప్రణయ్ మినహా అందరూ గెలిచారు.

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ర	పా
రాజస్థాన్	9	8	1	0.69	16
కోల్‌కతా	8	5	3	0.97	10
హైదరాబాద్	8	5	3	0.57	10
లక్నో	9	5	4	0.05	10
ఢిల్లీ	10	5	5	-0.27	10
చెన్నై	8	4	4	0.41	8
గుజరాత్	9	4	5	-0.97	8
పంజాబ్	9	3	6	-0.18	6
ముంబై	9	3	6	-0.26	6
బెంగళూరు	9	2	7	-0.72	4

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

ఐటీలో తగ్గుతున్న ఉద్యోగాలు

టాప్-5 సంస్థల్లో తగ్గిన 70 వేల మంది

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: దేశీయ ఐటీ సంస్థలకు నిరాశే ఎదురవుతున్నది. ఒకప్పుడు ఉద్యోగులతో కళకళలాడిన సంస్థలు ప్రస్తుతం భారీగా తగ్గిపోతున్నారు. ఇదే క్రమంలో గడిచిన ఆర్థిక సంవత్సరంలో దేశీయ ఐటీ దిగ్గజాల నుంచి 70 వేల మంది సిబ్బంది వెళ్లిపోయారు. అంతర్జాతీయ దేశాల ఆర్థిక పరిస్థితులు నిరాశాజనకంగా ఉండటంతో ఐటీ సంస్థలు తమ ఖర్చులను తగ్గించుకునేపనిలో పడ్డాయి. దీంతో గ్లోబల్ క్లయింట్లపై అత్యధికంగా ఆధారపడివున్న దేశీయ ఐటీ సంస్థలు సిబ్బంది వెళ్లిపోతున్న కొత్తవారిని నియమించుకోవడం లేదు. ఉన్నవారితోనే క్లయింట్లకు ఐటీ సేవలు అందిస్తున్నాయి. టాప్-5 సంస్థలైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్), ఇన్ఫోసిస్, విప్రో, టెక్ మహీంద్రాలు 69,167 మందిని కోల్పోగా..కేవలం హెచ్‌సీఎల్ కొంతమందిని నియమించుకున్నది. గడిచిన ఐదేండ్లలో ఇలా ఉద్యోగులు తగ్గడం ఇదే తొలిసారి కావడం విశేషం.

- 2023-24లో ఇన్ఫోసిస్ ఉద్యోగుల సంఖ్య 25,994 తగ్గారు. టీసీఎస్ నుంచి 13,249 మంది వైదొలిగారు.
- నాలుగో త్రైమాసికంలో 6,180 మంది సిబ్బందిని కోల్పోయిన విప్రో..గతేడాది మొత్తానికి 24,516 మంది దూరమయ్యారు.
- మార్చి త్రైమాసికంలో 795 మంది తగ్గిన టెక్ మహీంద్రాలో మొత్తం ఏడాదికిగాను 6,945 తగ్గి 1,45,455కి పరిమితమయ్యారు.

2023-24లో దేశీయ టాప్-5 ఐటీ కంపెనీల్లో తగ్గిన ఉద్యోగులు

టీసీఎస్	-13,249
ఇన్ఫోసిస్	-25,994
హెచ్‌సీఎల్ టెక్	1537
విప్రో	-24,516
టెక్ మహీంద్రా	-6945
మొత్తం	-69,167

యెస్ బ్యాంక్ లాభం రెండింతలు

ముంబై, ఏప్రిల్ 27: ప్రైవేట్ రంగ ఆర్థిక సేవల సంస్థ యెస్ బ్యాంక్ లాభాల్లో భారీ వృద్ధి నమోదైంది. స్టాండ్‌లోన్ ప్రతిపాదికన 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికానికిగాను రూ.452 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.202.43 కోట్ల లాభంతో పోలిస్తే రెండు రెట్లు పెరిగినట్లు వెల్లడించింది. మొండి బకాయిల కోసం నిధుల కేటాయింపులు తగ్గుముఖం పట్టడం వల్లనే లాభాల్లో భారీ వృద్ధి నమోదైందని బ్యాంక్ ఎండీ, సీఈవో ప్రశాంత్ కుమార్ తెలిపారు

వాణిజ్య

కొత్త విమానాశ్రయాలు కష్టమే!

- **ఎయిర్‌పోర్టుల ఏర్పాటులో వివక్ష**
- **పదేండ్లుగా కేంద్రం నాన్చుడు ధోరణి**
- **కార్యకలాపాలకు సిద్ధంగా ఉన్న వాటినీ ప్రారంభించని మోదీ సర్కారు**
- **ఆంధ్రప్రదేశ్‌లో ఏడు ఎయిర్‌పోర్టులు**
- **మన రాష్ట్రానికి రెండు మాత్రమే దిక్కు**

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): నాలుగు కోట్లకుపైగా జనాభా.. దేశానికి ఐటీ అడ్డా.. వ్యాక్సిన్‌ల తయారీలో ప్రపంచానికే దిక్సూచి.. అనేక అంతర్జాతీయ పరిశ్రమల కేంద్రం.. నిత్యం వేల సంఖ్యలో దేశ, విదేశీ ప్రయాణాలు.. ఇదీ తెలంగాణ రాష్ట్రం ఘనత. అయినా రాష్ట్రానికి విమానయానం గగనంగా మారింది. ఒకే ఒక్క ఎయిర్‌పోర్టు ద్వారా ప్రయాణాలు సాగించడం కష్టతరమవుతున్నది. రాష్ట్రంలో ఆరు కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు గత కేసీఆర్ సర్కారు ప్రతిపాదనలు పంపినా పదేండ్లుగా కేంద్రం నాన్చుడు ధోరణి అలంభిస్తున్నది. ఏపీలో ఏడు ఎయిర్‌పోర్టులు ఉండగా, తెలంగాణలో విమానాశ్రయాల ఏర్పాటులో కేంద్రం వివక్ష ప్రదర్శిస్తున్నది. కనీసం కార్యకలాపాలకు సిద్ధంగా ఉన్న వాటికి కూడా మోదీ సర్కారు అనుమతి ఇవ్వడం లేదు. ఇటు ఆదిలాబాద్, అటు భద్రాచలం వంటి మారుమూల ప్రాంతాల నుంచి కూడా ఎటైనా వెళ్లాలంటే శంషాబాద్‌కు రావాల్సిన దుస్థితి. రెండు గంటల ఢిల్లీ ప్రయాణానికి ఐదారు గంటలు కారులో ఎయిర్‌పోర్టుకు చేరుకోవాల్సిన పరిస్థితి. దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు డొమెస్టిక్ ఎయిర్‌పోర్టుల ఏర్పాటుకు రాష్ట్రంలో అన్ని అవకాశాలు ఉన్నప్పటికీ కేంద్రంలోని బీజేపీ సర్కారు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నది.

మూడు విమానాశ్రయాలకు ఏఏఐ సిఫారసు

తెలంగాణ ఏర్పాటైన తర్వాత ప్రజల అవసరాలు, రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఆరు కొత్త విమానాశ్రయాలను ఏర్పాటు చేయాలని నాటి ముఖ్యంత్రి కే చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ, మహబూబ్‌నగర్ సమీపంలోని దేవరకొండలో గ్రీన్‌ఫీల్డ్ (కొత్తగా ఏర్పాటుచేయడం) ఎయిర్‌పోర్టులు, వరంగల్ జిల్లా మామునూరు, పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్‌తోపాటు ఆదిలాబాద్‌లో బ్రౌన్‌ఫీల్డ్ (ప్రస్తుతం ఉన్నవాటిని అభివృద్ధి చేయడం) ఎయిర్‌పోర్టులు అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. మామునూరు (వరంగల్), ఆదిలాబాద్, జక్రాన్‌పల్లిలో మాత్రమే టెక్నికల్లీ ఫీజబుల్ ఉన్నట్టు నివేదికలో పేర్కొన్నది. ఫీజబుల్ ఉన్న మూడు ఎయిర్‌పోర్టులను చిన్న విమానాల కోసం ప్రారంభించాలని, భూసేకరణ చేయాల్సిన అవసరం కూడా లేనందున వెంటనే ప్రారంభించుకోవచ్చని కూడా ఏఏఐ సిఫారసు చేసింది. అప్పటి సీఎం కేసీఆర్ పలుమార్లు కేంద్రానికి లేఖలు రాసినప్పటికీ, పౌరవిమానాశ్రయాల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా స్వయంగా హైదరాబాద్‌లో కేసీఆర్‌తో సమావేశమై ఎయిర్‌పోర్టుల ఏర్పాటునకు హామీ ఇచ్చినప్పటికీ ఇవి కార్యరూపం దాల్చలేదు.

మూతపడిన మామునూరు ఎయిర్‌పోర్టు

నిజాం హయాంలో 1930లో మామునూర్ ఎయిర్‌పోర్టును సుమారు 1,930 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటుచేశారు. చాలాకాలంపాటు ఆజంజాహి మిల్స్, సిర్‌పూర్ పేపర్ మిల్స్‌తో పాటు వాణిజ్య, పౌర సేవలకు ఇది ఎంతగానో ఉపయోగపడింది. ఎంతో విశాలమైన ఈ ఎయిర్‌పోర్టు ఉమ్మడి రాష్ట్రంలో పాలకుల నిర్లక్ష్యం వల్ల మూతపడింది.

ఎయిర్‌పోర్టులు ఉన్నా ఉపయోగం సున్నా..

- రాష్ట్రంలో ప్రస్తుతం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ఒక్కటే వాణిజ్య అవసరాలకు ఉపయోగపడుతున్నది.
- బేగంపేట్ ఎయిర్‌పోర్టును మూసివేయగా, ప్రస్తుతం ఇది వీవీఐపీలు, ప్రైవేట్ చార్టర్ట్ ఫ్లైట్స్‌కు ఉపయోగపడుతున్నది.
- వరంగల్‌లోని మామునూర్ ఎయిర్‌పోర్టు ప్రతిపాదన 1981 నుంచి, రామగుండం ఎయిర్‌పోర్టు ప్రతిపాదన 1995 నుంచి పెండింగులో ఉన్నది.
- శంషాబాద్ ఎయిర్‌పోర్టు జీఎంఆర్ ఆధ్వర్యంలో కొనసాగుతుండగా, బేగంపేట్, వరంగల్ విమానాశ్రయాలు ఏఏఐ ఆధీనంలో ఉన్నాయి.
- రామగుండం ఎయిర్‌పోర్టు ఏఏఐతో పాటు ఆదిత్య బిర్లా సంయుక్త ఆధ్వర్యంలో ఉన్నది.
- ఇవికాకుండా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఆధ్వర్యంలో దుండిగల్, హకీంపేట్ విమానాశ్రయాలు ఉన్నప్పటికీ ఇవి రక్షణ శాఖ ఆధీనంలో ఉన్నాయి.
- ఏపీతోపాటు పలు ఇతర రాష్ట్రాల్లో రక్షణ శాఖకు చెందిన ఎయిర్‌పోర్టులను పౌరసేవలకు ఉపయోగిస్తున్నప్పటికీ మన రాష్ట్రంలోని హకీంపేట్, దుండిగల్ ఎయిర్‌పోర్టులను పౌరసేవలకు ఉపయోగించేందుకు కేంద్రం ఒప్పుకోవడం లేదు.

ఏపీలో మాత్రం ఏడు విమానాశ్రయాలు..

- ఏపీలో కడప, కర్నూల్, పుట్టపర్తి (ప్రైవేటు), రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం ఇలా ఏడు విమానాశ్రయాలు సేవలు అందిస్తున్నాయి.
- ఇందులో తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం విమానాశ్రయాలు అంతర్జాతీయ విమానాశ్రయాలు కావడం విశేషం.
- విశాఖపట్నంలో భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో ఉండగా, నెల్లూరు జిల్లాలో ఎయిర్‌పోర్టు ఏర్పాటునకు ప్రతిపాదనలున్నాయి.
- విశాఖపట్నంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎయిర్‌పోర్టు ఇండియన్ నేవీ, ఏఏఐ సంయుక్త ఆధ్వర్యంలోనిది కాగా, భోగాపురంలో జీఎంఆర్ ఆధ్వర్యంలో కొత్త ఎయిర్‌పోర్టు నిర్మిస్తున్నారు. పుట్టపర్తిలో ప్రైవేటు ఎయిర్‌పోర్టు ఉంది.

రియల్‌మీ చౌకైన 5జీ

- **ప్రారంభ ధర రూ.9,999**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: రియల్‌మీ.. దేశీయ మార్కెట్‌కు చౌక ధర కలిగిన 5జీ స్మార్ట్‌ఫోన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎంట్రీలెవల్ స్మార్ట్‌ఫోన్ ప్రారంభ ధర రూ.9,999గా నిర్ణయించింది. మూడు రకాల్లో లభించనున్న ఈ ఫోన్ల లో 4జీబీ+64జీబీ మాడల్ ధర రూ. 10,499, 4జీబీ+128జీబీ మాడల్ ధర రూ.11,499, 6జీబీ+128జీబీ ధర రూ.12,499కి విక్రయించనున్నది. ఈ నెల 30 లోగా రియల్‌మీ.కామ్, ఫ్లిప్‌కార్ట్‌లో బుకింగ్ చేసుకున్నవారికి రూ.1,000 వరకు ఆఫర్ ఇస్తున్నాయి.

త్వరలో చిన్న హైబ్రిడ్ కారు!

- **అందుబాటు ధరలో ఉంటుందన్న మారుతి చైర్మన్ ఆర్‌సీ భార్గవ**

న్యూఢిల్లీ, ఏప్రిల్